సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




సోమవారం 30 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 301 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు – కాళేశ్వరం, మైనింగ్, దళిత అంశాలపై ఘాటు విమర్శలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ అంశాలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కేసీఆర్ కుటుంబం దోపిడీకి పాల్పడిందని ఆరోపిస్తూ, ఈ విషయాన్ని దేశ ప్రధాని, హోంశాఖ మంత్రి కూడా ప్రస్తావించారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీబీఐకి కేసు అప్పగిస్తే 48 గంటల్లోనే చర్యలు తీసుకుంటామని చెప్పినా, ఇప్పటివరకు పురోగతి లేకపోవడం ప్రజలు గమనించారని అన్నారు. కాళేశ్వరం కేసులో కేసీఆర్, హరీష్ రావుపై చర్యలు తీసుకున్న తర్వాతే బీజేపీ నేతలు విమర్శలు చేయాలని సూచించారు. మహబూబ్ నగర్ జిల్లాలో భూబదలాయింపులపై నిర్దిష్ట ఆరోపణలు చేస్తూ, హరీష్ రావు అంగీకరిస్తే హౌస్ కమిటీ వేయడానికి సిద్ధమని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ ఆదాయం పెంచి పేదలకు పంచాలనే లక్ష్యంతో సంస్కరణలు అమలు చేస్తున్నామని, అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని వెల్లడించారు. హౌస్ కమిటీ పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. దళితుల అంశంపై మాట్లాడుతూ, కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం దళితులకు కీలక పదవులు కల్పించిందని, భట్టి విక్రమార్కను ఉప ముఖ్యమంత్రిగా నియమించిన విషయాన్ని గుర్తుచేశారు. దళితుల పట్ల గత ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనకా గాంధీ బృందంతో సమావేశమై రాష్ట్రంలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ చర్యలను వివరించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేసి ప్రశంసించారు.

## వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు చట్టం – శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణకు సంబంధించి ప్రభుత్వం తీసుకువస్తున్న బిల్లుపై భావోద్వేగంతో స్పందించారు. పురాణాల్లో మాతృపితృ భక్తికి ప్రతీకగా నిలిచిన శ్రవణ కుమారుడి గాథను ఉదాహరణగా ప్రస్తావిస్తూ తల్లిదండ్రులపై ప్రేమాభిమానాలు ఉంటే చట్టాలు అవసరం ఉండవని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, రేమండ్స్ మాజీ అధినేత విజయ్ పత్ సింఘానియా జీవితం ద్వారా ఆధునిక సమాజంలో పెరుగుతున్న నిర్లక్ష్యాన్ని వివరించారు. పిల్లల హక్కులు, మహిళల భద్రత కోసం అనేక చట్టాలు అమలులో ఉన్నప్పటికీ వృద్ధుల సంరక్షణ విషయంలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. “Maintenance and Welfare of Parents and Senior Citizens Act 2007” వంటి చట్టాలు ఉన్నప్పటికీ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఘటనలు తగ్గడం లేదన్నారు. తల్లిదండ్రులను చూసుకోని వారిని సమాజం తప్పుబట్టాలని, వృద్ధులకు రక్షణ కల్పించే దిశగా ఈ బిల్లు కీలక అడుగని స్పష్టం చేశారు. వృద్ధులు తమ చివరి దశలో అనాథలుగా మారకుండా, వారి సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉండాలని ఈ చట్టం ద్వారా స్పష్టమైన సందేశం ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించినట్లు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డితో మేనకా గాంధీ బృందం భేటీ – జంతు సంరక్షణ చర్యలపై సమీక్ష



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మేనకా గాంధీ బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ చర్యలను అధికారులు మేనకా గాంధీకి వివరించారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, రాష్ట్రంలో గోసంరక్షణ కోసం ఇప్పటికే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సీఎం తెలిపారు. ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో విశాల ప్రదేశంలో గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వివరించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీపంలో గోశాలల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జంతు సంరక్షణ విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేసి రాష్ట్ర ప్రభుత్వ కృషిని ప్రశంసించారు.

## కేరళలో కాంగ్రెస్ కూటమి విజయం ఖాయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: కేరళ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేరళ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇంచార్జ్ దీపదాస్ మున్షితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, పతనంతిట్ట జిల్లా అడూర్ నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి శాంతకుమార్ మద్దతుగా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూటమికి ప్రజల్లో అనుకూల వాతావరణం పెరిగిందని, ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపిస్తూ, అభివృద్ధి పేరుతో ప్రచారం మాత్రమే జరిగిందని విమర్శించారు. బీజేపీపై కూడా విమర్శలు గుప్పిస్తూ మతపరమైన రాజకీయాలతో ప్రజలను విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. సీపీఎం వైఫల్యాలు, బీజేపీ విభజన రాజకీయాల మధ్య కేరళ ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.



## త్రిస్సూర్ రోడ్‌షోలో అపూర్వ జనసందోహం: అభివృద్ధికి పట్టం కడతాం – బీజేపీ

త్రిస్సూర్, సందేశం టైమ్స్, మార్చి 30, 2026, రిపోర్టర్ శెట్టి వెంకటేష్: కేరళ త్రిస్సూర్ నగరంలో ఈరోజు నిర్వహించిన బీజేపీ రోడ్‌షో అపూర్వ జనసందోహం మరియు ఉత్సాహంతో ముగిసింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ ప్రజలు పార్టీ ఎంపీని గెలిపించటం ద్వారా కేరళలో బీజేపీకి తొలి పార్లమెంటరీ విజయాన్ని అందించిన చరిత్రను గుర్తుచేసుకున్నాయి. నాయకులు మాట్లాడుతూ, త్రిస్సూర్ ప్రజలకు అత్యుత్తమ సుపరిపాలన అందించడానికి ప్రభుత్వమంతా కట్టుబడి ఉందని, బీజేపీ-ఎన్‌డీఏ కూటమికి ఇచ్చే ప్రతి ఓటు ప్రాంత అభివృద్ధికి ఓటు అని స్పష్టం చేశారు. ముఖ్యంగా భౌతిక మరియు సామాజిక మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధికి నూతన దారులు తొక్కుతామని హామీ ఇచ్చారు. రోడ్‌షోలోని ప్రజా మద్దతు త్రిస్సూర్ పురోగతిపై ప్రజల ఆశలను ప్రతిబింబిస్తున్నది, రాబోయే రోజుల్లో మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దమని నాయకులు పేర్కొన్నారు.

## ఒకే జలాంతర్గామి.. 33 దేశాలను ఆశ్చర్యపరిచిన భారత నౌకాదళ ఫిలిప్పీన్స్ ఘనత



విశాఖపట్నం, సందేశం టైమ్స్, మార్చి 30: విశాఖపట్నం సమీపంలో జరిగిన ‘మిలన్ 2026’ అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాల్లో, భారత నౌకాదళానికి చెందిన జలాంతర్గామి ఫిలిప్పీన్స్ దేశపు యుద్ధనౌక ‘బీఆర్పీ మిగెల్ మాల్వర్’ ద్వారా విజయవంతంగా గుర్తించబడింది. 30 కంటే ఎక్కువ దేశాలు పాల్గొన్న ఈ విన్యాసాల్లో, కేవలం ఫిలిప్పీన్స్ యుద్ధనౌక మాత్రమే భారత జలాంతర్గామిని గుర్తించగలిగింది. ఉమ్మడి విన్యాసాల్లో అమెరికా, రష్యా వంటి అగ్రరాజ్యాలతో సహా మొత్తం 33 యుద్ధనౌకలు పాల్గొన్నాయి.అత్యంత కఠినమైన ‘యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్’ శిక్షణ సమయంలో, సముద్ర గర్భంలో దాగి ఉన్న భారత జలాంతర్గామిని ఫిలిప్పీన్స్ అత్యాధునిక క్షిపణి వాహక నౌక ఖచ్చితంగా గుర్తించగలిగింది. ఫిలిప్పీన్స్ నౌకాదళ ప్రతినిధి రియర్ అడ్మిరల్ రాయ్ విన్సెంట్ ట్రినిడాడ్ మాట్లాడుతూ, "33 యుద్ధనౌకల్లో, భారత జలాంతర్గామిని గుర్తించిన ఏకైక నౌక మా ‘మాల్వర్’. ఇది మా నౌకాదళ సామర్థ్యానికి స్పష్టమైన సాక్ష్యం. సముద్ర గర్భంలో వ్యాపించే శబ్దాల సూత్రాలను గమనించడం ద్వారా మా సిబ్బంది ఈ ఘనత సాధించారు" అన్నారు.అయితే, ఫిలిప్పీన్స్ నౌకాదళ సాంకేతికత ఇతర అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా ఎక్కువగా అభివృద్ధి కాలేదని ఆయన పేర్కొన్నారు.అయినప్పటికీ, సైనికుల వ్యక్తిగత నైపుణ్యం, సముద్ర ప్రవాహాలు, ధ్వని తరంగాలను గమనించే తెలివితేటలు ఈ ఘనత సాధించడానికి కీలకం అయ్యాయి.గత ఫిబ్రవరి 17 నుంచి 26 వరకు జరిగిన విన్యాసాల్లో, ఫిలిప్పీన్స్ దేశం మొదటిసారిగా పాల్గొంది. తొలి ప్రయత్నంలోనే భారత జలాంతర్గామిని గుర్తించడం ద్వారా, ఆసియా ప్రాంతంలో ఫిలిప్పీన్స్ నౌకాదళ ప్రాముఖ్యత పెరిగిందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అమెరికాలో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా సుమారు 90 లక్షల మందితో నిరసనలు




వాషింగ్టన్, సందేశం టైమ్స్, మార్చి 30: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విపరీతమైన నిరసనలు వెల్లువెత్తాయి. 50 రాష్ట్రాల్లో దాదాపు 3,000 ప్రాంతాల్లో “No Kings” పేరుతో నిరసనలు నిర్వహించగా, సుమారు 90 లక్షల మందికి పైగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేపట్టారు.ప్రజలు “లాభాల కోసం యుద్ధమా?” అని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించగా, “అమెరికా సైనికులు అమ్మకానికి లేరు” అంటూ యుద్ధ విధానాలపై వ్యతిరేక నినాదాలు వినిపించాయి. “అన్యాయం చట్టమైతే, ప్రతిఘటనే కర్తవ్యము” అని ప్రజలు గట్టిగా నినదించగా, ఈ నిరసనలు దేశవ్యాప్తంగా విపుల చర్చకు దారితీస్తున్నాయి. విశ్లేషకుల అభిప్రాయంలో, ట్రంప్ ప్రభుత్వ విదేశాంగ మరియు రక్షణ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని స్పష్టమవుతోంది.



## గోదావరి పుష్కరాలపై సీఎం సమీక్ష – బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధి పనులకు దిశానిర్దేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన ఆలయాలు, పుష్కర ఘాట్ల అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. 2027 జూన్‌లో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీని నియమించాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటించి 15 నుంచి 20 రోజుల్లో నివేదిక సమర్పించాలని, ఆ నివేదికను అధికారుల కమిటీ పరిశీలించి పూర్తి అంచనాలతో కేబినెట్ సబ్ కమిటీకి పంపాలని తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం తుది నిర్ణయం కేబినెట్ తీసుకుంటుందని పేర్కొన్నారు. శాశ్వత, తాత్కాలిక పనులను ప్రాధాన్యతల ప్రకారం పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. విభాగాల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా ప్రజా భవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల్లో ఘాట్ల విస్తరణ చేపట్టాలని, రోడ్లు మరియు కనెక్టివిటీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు సీఎంకు వివరించగా, దీనిపై కూడా సీఎం పలు సూచనలు చేశారు.

## వృద్ధ తల్లిదండ్రుల గౌరవ రక్షణకు చట్టం – తెలంగాణ అసెంబ్లీలో కీలక బిల్లు ఆమోదం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: వృద్ధ తల్లిదండ్రుల గౌరవం, భద్రతను పరిరక్షించేందుకు తెలంగాణ శాసనసభలో "టెలంగాణ ఎంప్లాయీస్ రెస్పాన్సిబిలిటీ అండ్ పేరెంటల్ కేర్ మానిటరింగ్ బిల్లు–2026" ఆమోదం పొందింది. సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రవేశపెట్టిన ఈ బిల్లు స్పీకర్ అనుమతితో ఆమోదించబడింది. ఈ చట్టం ద్వారా ఉద్యోగులు తమ తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యతలను స్పష్టంగా నిర్వచిస్తూ, ఆరోగ్యం, నివాసం, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిర్దేశించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఘటనలను నిరోధించేందుకు పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి, అవసరమైతే అధికారుల జోక్యంతో చర్యలు తీసుకునే విధానాన్ని కూడా ఇందులో పొందుపరిచారు. ఈ బిల్లు ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి పోషణ కోరుకునే హక్కును పొందడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో కుటుంబ విలువలను కాపాడేందుకు ఈ చట్టం కీలకమని మంత్రి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ చట్టం సమాజంలో బాధ్యతను పెంపొందించి, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ముదిరాజ్ మహిళ మృతి – కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన ముదిరాజ్ మహిళ రంగంపేట లక్ష్మి ఆదివారం ఉదయం మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పట్లూరి శివశేఖర్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని ముదిరాజ్ సంఘం సభ్యులు బరుడి వీరేశం, పట్నం విద్యాసాగర్, రంగంపేట రాజు కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బరుడి వీరేశం, రంగంపేట రాజు, పట్నం విద్యాసాగర్, రంగంపేట పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో కొప్పుల శేషారెడ్డి

సంగారెడ్డి, సందేశం టైమ్స్, మార్చి 30, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండల పరిధిలోని అప్పాజిపల్లి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో "ఇందిరమ్మ ఇళ్లు" పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించేలా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నదని పేర్కొన్నారు. గతంలో ఇందిరా గాంధీ పేదల కోసం చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమాల స్ఫూర్తితో ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాష్ రావు, బాలకిషన్, అంజ గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, కొంక శ్రీశైలం, బాలరాజు, సాయిలు, బ్రమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.10,000 కోట్ల పొదుపు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు రూ.10,000 కోట్లకు పైగా రవాణా ఛార్జీలను ఆదా చేసుకున్నట్లు టీజీఎస్‌ఆర్టీసీ వెల్లడించింది. 2023 డిసెంబర్ 9న ప్రారంభమైన ఈ పథకం కింద 2026 మార్చి 29 నాటికి సుమారు 290 కోట్లకు పైగా ఉచిత ప్రయాణ టికెట్లు మహిళలు వినియోగించుకున్నారని సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి తెలిపారు. గతంలో నెలకు రూ.1,500 నుంచి రూ.2,500 వరకు రవాణా ఖర్చులు భరించిన మహిళలు ఇప్పుడు ఆ మొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారని, ఇది మహిళల ఆర్థిక స్వావలంబనకు నిదర్శనమని పేర్కొన్నారు. పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల శాతం 40 నుంచి 67 శాతానికి పెరిగిందని, ప్రతిరోజూ సగటున 35 లక్షల మందికి పైగా మహిళలు ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. ఉచిత ప్రయాణానికి సంబంధించిన ఖర్చులను ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ రూపంలో చెల్లిస్తూ ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడుతోందని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం మహిళా సాధికారతకు దోహదపడుతోందని, రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఇది కీలకంగా మారిందని అన్నారు. త్వరలో స్మార్ట్ కార్డుల ద్వారా ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



## మరవెల్లి సీఎస్ఐ చర్చిలో ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

సంగారెడ్డి, సందేశం టైమ్స్, మార్చి 30, అందోల్ టౌన్ ప్రతినిధి బి. రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గంలోని మరవెల్లి గ్రామంలో గల సీఎస్ఐ సంఘంలో మట్టల ఆదివారం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులందరూ మట్టలతో ఊరేగింపుగా తరలివచ్చి ప్రత్యేక ఆరాధన కార్యక్రమాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ వేడుకలను ఉద్దేశించి స్థానిక గురువులు రెవ. జి. దేవదాస్ అయ్యగారు మాట్లాడుతూ, యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, మరియు దయకు ప్రతిరూపమని, ఆయన లోక కళ్యాణం కోసం ఎన్నో గొప్ప కార్యాలు చేశారని కొనియాడారు. మానవాళి పాప విముక్తి కోసం క్రీస్తు సిలువను మోసి, ఎన్నో అవమానాలను భరించారని, అటువంటి దైవకుమారుడి విజయ ప్రవేశానికి గుర్తుగా జరుపుకునే ఈ మట్టల ఆదివారం పర్వదినాన్ని అందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.

## రామేశ్వరంబండ సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: పటాన్చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో రామేశ్వరంబండ ప్రాంత సమగ్ర అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం రామేశ్వరంబండ పరిధిలోని ఇంద్రపురి కాలనీలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో రామేశ్వరంబండ పరిధిలోని నాలుగు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు భారీ విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ప్రమీల, కమిషనర్ అజయ్ రెడ్డి, వైస్ ఛైర్మన్ హరీష్ రెడ్డి, కౌన్సిలర్లు అంతిరెడ్డి, రమేష్, వంకదోత్ రమేష్, మాజీ ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చింతకాని, బోనకల్ మండలాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న లింగాల కమల్ రాజు





సందేశం టైమ్స్, మధిర, మార్చి 30, ప్రతినిధి: చింతకాని, బోనకల్ మండలాల్లో ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలకు మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై పలు కుటుంబాలను పరామర్శించారు. చింతకాని మండలం నరసింహపురం గ్రామంలో జల్లి ఉపేంద్ర కుమార్తె ఓణీల అలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం రాయన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ వల్లెబోయిన కొండలరావు తల్లి మరణించడంతో వారి భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తరువాత రాయన్నపేట గ్రామంలో తలసేమియా బాధితుల కోసం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేసిన యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చింతకాని, బోనకల్ మండలాల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత కోసం ట్రాక్టర్లపై లౌడ్ స్పీకర్ల తొలగింపు




సందేశం టైమ్స్, మధిర, మార్చి 30, ప్రతినిధి: రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లను పరిశీలించి వాటికి బిగించిన లౌడ్ స్పీకర్లను అధికారులు తొలగించారు. లౌడ్ స్పీకర్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న మండవ సర్పంచ్ పరచగాని రామచంద్రయ్యతో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు. ఇకపై ఎవరైనా వాహనదారులు లౌడ్ స్పీకర్లు వినియోగిస్తే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



## తేజశ్రీ ఓణీల వేడుకలో పాల్గొన్న లింగాల కమల్ రాజు

సందేశం టైమ్స్, మధిర, మార్చి 30, ప్రతినిధి: చింతకాని మండలం నరసింహపురం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు జల్లి ఉపేందర్, సుమలతల కుమార్తె తేజశ్రీ ఓణీల వేడుకకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్ రాజు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, మాజీ ఎంపీపీ కొనుగోటి రత్నాకర్, రైతు సంఘం నాయకులు గడ్డం శ్రీనివాస్, నన్నక నరసింహారావు, నన్నక గోవిందరావు, పటేటి గోపయ్య, లోయ మల్లేష్, వైస్ సర్పంచ్ దొడ్డ వీరబాబు, జానపాటి శంకర్, పటేల్ శ్రీకాంత్, బండ్ల బబ్లీ, పటేట్ యాదగిరి, జానపాటి పానకాలు, నన్నక పెద్ద నరసింహారావు, ఆకులు చంద్రయ్య, జలగబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాయిలసింగవరం గ్రామంలో ఉచిత గర్భాశయ క్యాన్సర్ గుర్తింపు శిబిరం నిర్వహణ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, ప్రతినిధి: అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలో వికాస తరంగిణి మరియు స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత గర్భాశయ క్యాన్సర్ గుర్తింపు చికిత్స శిబిరం నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ కీర్తిశేషులు గద్దె రామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు శిబిరాన్ని ప్రారంభించగా, గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో వాయిలసింగవరం మరియు పరిసర గ్రామాలకు చెందిన సుమారు 150 మంది మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ఇలాంటి ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఉష, మాధవి, విజయలక్ష్మి, ట్రస్టు అధ్యక్షుడు చారుగుండ్ల ప్రవీణ రాజశేఖర్, ఉప సర్పంచ్ కంటు రమాదేవి, వార్డు సభ్యులు తమలపాకుల వెంకటేష్, దేవులపల్లి నాగరాజు, మాజీ PACS చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, పగిడి రామారావు, దాములూరి మురళి, కంటు చిన నాగేశ్వరరావు, గుండ్లపల్లి వెంకన్న, బుర్రా నాగమల్లేశ్వరరావు, మేళ్లచెర్వు చిన బిక్షం, చుండూరి సుధీర్, అంగన్‌వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



## వాయిలసింగవరం గ్రామంలో సీసీ రోడ్డుకు శంఖుస్థాపన

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, ప్రతినిధి: అనంతగిరి మండలం వాయిలసింగవరం గ్రామంలోని ముదిరాజ్ కాలనీలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యస్వీ విద్యాసంస్థల వైస్ చైర్మన్ గద్దె రఘు, సహకార సంఘం అధ్యక్షుడు కంటు నాగార్జున, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, కంటు చిన నాగేశ్వరరావు, వార్డు సభ్యులు దేవులపల్లి నాగరాజు, దాములూరి మురళి, బొర్ర నవీన్, గుండ్లపల్లి వెంకన్న, చుండూరు సుధీర్, కంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాల అభివృద్ధి ద్వారానే ఉన్నతమైన జీవితం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, ప్రతినిధి: కేంద్ర మానవ వనరులు మరియు యువజన వ్యవహారాల శాఖ సహకారంతో తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు ఆధ్వర్యంలో కలవకూర్, మల్కాపూర్, అంగడిపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా "నాయకత్వ లక్షణాలు – నైపుణ్యాల అభివృద్ధి" అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సోలాపూర్‌కు చెందిన జ్ఞాన ప్రబోధిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్ఞాన ప్రబోధిని స్వచ్ఛంద సంస్థ జాయింట్ సెక్రటరీ అమూల్ గాంగిలి మాట్లాడుతూ యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, నైపుణ్యాల ద్వారానే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటే యువత ఏ లక్ష్యాన్నైనా సాధించగలదని పేర్కొన్నారు. యువత స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని, దేశ నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని సూచించారు. బాలికలను ఉద్దేశించి మహిళల పాత్ర జాతి నిర్మాణంలో కీలకమని, లక్ష్యసాధనలో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

## జాతి నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ పాత్ర అద్వితీయమైనది



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, ప్రతినిధి: తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన కలవకూర్, మల్కాపూర్, అంగడిపేటలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా "జాతి నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ పాత్ర" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన సంఘాల నాయకుడు డాక్టర్ కూన వేణు మాట్లాడుతూ కుల, మత, భాష, ప్రాంత భేదాలు లేకుండా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిరంతరం సామాజిక సేవలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. దేశ నిర్మాణం మరియు జాతి నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర అత్యంత ముఖ్యమైందని పేర్కొన్నారు. వాలంటీర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సాంఘిక, ఆర్థిక దురాచారాల నిర్మూలనకు కృషి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, అంటువ్యాధుల నివారణ వంటి అంశాలపై చైతన్యం తీసుకువస్తున్నారని వివరించారు. బాలికలను ఉద్దేశించి నేటి సమాజంలో అన్ని రంగాల్లో వారు రాణిస్తున్నారని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

## పోల్కంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 30, మునిపల్లి మండలం ప్రతినిధి: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పోల్కంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి పటేల్, గ్రామ సర్పంచ్ వీరేశం, మాజీ సర్పంచ్ నాగమణి, సంగయ్య, అంజయ్య, సంగమేశ్వర్, సదాశివులు, మల్లన్నతో పాటు వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## స్టేట్ లెవల్ తైక్వాండో పోటీల్లో ఫేమస్ తైక్వాండో అకాడమీ విద్యార్థుల ప్రతిభ







సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 30, శెట్టి వెంకటేష్: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరిగిన 14వ ఓపెన్ స్టేట్ లెవల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఫేమస్ తైక్వాండో అకాడమీ ఆఫ్ ఇండియా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. మార్చి 28, 29 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది క్రీడాకారులు పాల్గొనగా, అకాడమీకి చెందిన విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ప్రదర్శనతో మెడల్స్ సాధించి అకాడమీకి మంచి పేరు తీసుకొచ్చారు. పీవీ అండర్ 18 కిలోల విభాగంలో అవిక హయాతి బ్రాంజ్ మెడల్ గెలుచుకోగా, సబ్ జూనియర్ అండర్ 21 కిలోల విభాగంలో షిజిత్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ విజయానికి కారణం నాణ్యమైన శిక్షణేనని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించడమే లక్ష్యమని అకాడమీ ప్రతినిధులు తెలిపారు. మార్షల్ ఆర్ట్స్‌లో రాణించడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కోచ్ శెట్టి వెంకటేష్ గౌడ్, తల్లిదండ్రులు, జల్వాయువు టవర్స్ సభ్యులు విజేతలను అభినందిస్తూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

## జాతీయ మెగా లోక్-అదాలత్‌లో అపూర్వ స్పందన – 4,868 కేసులు రాజీతో పరిష్కారం

**సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందిస్తూ విశ్వాసం పెంపొందిస్తోంది**





సంగారెడ్డి, మార్చి 30 – సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మెగా లోక్-అదాలత్‌కు విపరీతమైన స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మొత్తం 4,868 కేసులను విజయవంతంగా రాజీ ప్రక్రియ ద్వారా పరిష్కరించారు.జిల్లా ఎస్పీ ప్రకారం, వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 717 IPC కేసులలో ఇరు వర్గాల మధ్య రాజీ జరిగింది. అదనంగా 2,722 e-పెట్టీలు, 1,429 DD కేసులలో అడ్మిషన్, జరిమానా విధింపు ప్రక్రియ పూర్తిచేసారు. దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసులకు ఈ లోక్-అదాలత్ ద్వారా ముగింపు సాధించబడింది.సైబర్ క్రైమ్ విషయంలో కూడా కీలక ముందడుగు వేసారు. జిల్లాలో నమోదైన 73 సైబర్ క్రైమ్ కేసులలో ₹1.32 కోట్లు, FIR లేకుండా ఉన్న 88 కేసుల్లో ₹10.83 లక్షలు కలిపి మొత్తం ₹1.42 కోట్లు బాధితులకు తిరిగి అందించేందుకు కోర్టు అనుమతులు పొందారు.ప్రజలకు సూచిస్తూ ఎస్పీ, వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించడం ఉత్తమమని, లోక్-అదాలత్ వంటి వేదికలను వినియోగించాలని, ఇరు వర్గాలు సమానంగా లాభపడతాయని అన్నారు.ప్రత్యేకంగా 2021లో మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన పెండింగ్ వివాదాన్ని పరిష్కరించి మురళి–శ్రీలేఖ దంపతులను మళ్లీ ఏకం చేయడం ఈ లోక్-అదాలత్ విజయానికి నిదర్శనం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించిన అధికారులను, పీపీలు, డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, కోర్ట్ డ్యూటీ సిబ్బంది, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీసుల సమన్వయం, అంకితభావం వల్ల ప్రజలకు న్యాయం త్వరగా అందించగలిగారని, దీని ద్వారా ప్రజల విశ్వాసం మరింత బలపడిందని అన్నారు.



## సంగారెడ్డి జిల్లా ఆర్టీఐ అధ్యక్షుడు, సభ్యులకు నియామక ఉత్తర్వులు ప్రదానం

జహీరాబాద్, మార్చి 30:— సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్‌లో నేషనల్ హ్యూమన్ రైట్స్ – సోషల్ జస్టిస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సమావేశం జరిగింది.జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగపల్లీ హుస్సేన్, రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది.సమావేశానికి జహీరాబాద్ డివిజన్ ఉమెన్ ప్రొటెక్షన్ జాయింట్ సెక్రటరీ బి. సుమిత్ర, న్యాల్‌కల్ మండల అధ్యక్షుడు నవీన్ కుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై సంస్థ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఆర్టీఐ అధ్యక్షుడిగా పడకంటి శ్రీశైలం, సభ్యుడిగా భైనగర్ సూర్యప్రకాశ్‌లకు నియామక ఉత్తర్వులు మరియు గుర్తింపు కార్డులు అందజేయబడింది. సభ్యులందరూ కలిసి సంస్థ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ మండల ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, వివిధ మండలాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కట్టుబడి పనిచేయాలని నేతలు సూచించారు.

## ₹5 లక్షలతో మంచిర్యాల తండా సీసీ రోడ్డు సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రారంభం



వట్పల్లి మండల్, మార్చి 30:— సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశాల మేరకు మంచిర్యాల తండా గ్రామంలో ₹5 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ జ్యోతి మోహన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత బాయ్, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుద్యాల పటేల్, వట్టిపల్లి గ్రామ సర్పంచ్ మల్లు రవి, ఇతర స్థానిక నేతలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంలో భాగంగా ఈ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.




## నల్ల పోచమ్మ అమ్మవారి జాతరకు దాత విరాళం

మనూర్ మండల్, మార్చి 30:— సంగారెడ్డి జిల్లా మనూర్ మండల్ బోరంచ గ్రామంలోని శ్రీశ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి 7 వారాల మహా జాతర సందర్భంగా గుడి అలంకరణ కోసం దాత చిన్నపట్లోల రామచంద్రారెడ్డి (తాండూర్, నాగిరెడ్డిపేట్ మండలం) రూ.21,000 విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది శేఖర్ శాలువాతో దాత దంపతులను సన్మానించి అమ్మవారి ఫోటోను బహుమతిగా అందజేశారు. ఈ విరాళానికి ఆలయ అర్చకులు, సిబ్బంది, గ్రామ ప్రజలు మరియు భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతకు శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.



## అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణపై మర్వెల్లిలో సభ్యుల విస్తృత చర్చ

సంగారెడ్డి, సందేశం టైమ్స్, బి రమేష్ బాబు, 30 మార్చి 2026: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం వట్పల్లి మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన సభ్యుల ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రతినిధి బి రమేష్ బాబు తెలిపారు, ఏప్రిల్ 14న జరగనున్న వేడుకలను కుల, మత భేదాలు మించిన ఐక్యతతో, పెద్ద ఎత్తున ఊరేగింపుతో ఘనంగా నిర్వహించుకోవాలని నిర్ణయించామని. గ్రామ వాసులందరి ఉత్సాహాన్ని చాటుతూ, ప్రతి ఒక్కరు తమవంతు సహకారాన్ని అందించాలని సభ్యులు పిలుపునిచ్చారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులు జయంతి ఉత్సవాల విజయానికి పూర్తి మద్దతునిచ్చి, ఏర్పాట్లపై తమ సూచనలను పంచుకున్నారు.

## ఏడుపాయల వన దుర్గ భవానీ మాతను జిల్లా కలెక్టర్ దంపతులు దర్శనం





సంగారెడ్డి, మార్చి 30 (సందేశం టైమ్స్, సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్): మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ దంపతులు ఆదివారం ఏడుపాయల వన దుర్గ భవానీ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీరేశం, అర్చకులు మరియు సిబ్బంది ఆలయ మర్యాదలతో కలెక్టర్ దంపతులను స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయబడినట్లు తెలిపారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో ఏడుపాయల వన దుర్గ భవానీ దేవత అత్యంత గౌరవనీయమైన మందిరం కాగా, భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం విధంగా దేవత విరాజిల్లుతుందని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే కారణంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయబడుతున్నాయని చెప్పారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో నిర్వాహకులు చూపిన సేవలను కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో ఈవో వీరేశం సిబ్బంది శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

## హస్నాబాద్ గ్రామ సర్పంచ్ తులసి హన్మంత్ 6వ వార్డ్ కోసం బోర్ వేసి అభినందనలు అందుకున్నారు





సంగారెడ్డి, రాయికోడ్ మండలం, హస్నాబాద్ గ్రామం, మార్చి 30, 2026: నూతన సర్పంచ్ శ్రీమతి పుర్ర తులసి హన్మంత్ 6వ వార్డ్ ప్రజల దాహార్తి తీర్చేందుకు సర్పంచ్ ఆధ్వర్యంలో శ్రీ మహాలక్ష్మి మందిరం వద్ద బోర్‌వే పెట్టడం పూర్తి చేశారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ఈ సేవలను నిర్వర్తించిన సర్పంచ్, గ్రామ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచారు. గ్రామ ప్రజలు సర్పంచ్ చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ, "సర్పంచ్‌గా మా గ్రామానికి ఉండటం మా పూర్వ జన్మ సుకృతం" అని తెలిపారు. అలాగే, గ్రామ యువతకు తులసి హన్మంత్ ఒక మంచి నాయకునిగా ఆదర్శంగా నిలిచారని, భవిష్యత్తులో కూడా ఆయన చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటామన్న భావాన్ని వ్యక్తం చేశారు.

## విశాఖలో వార్డు కార్యదర్శి సస్పెన్షన్ వేటు

విశాఖపట్నం, సందేశం టైమ్స్, మార్చి 30: విశాఖపట్నం ప్రాంతంలోని వార్డు కార్యదర్శిపై సస్పెన్షన్ విధించబడింది. సిటిజన్ eKYC నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శించడం, హౌస్‌హోల్డ్‌ను సందర్శించకుండానే మరణం (Death)గా రికార్డ్‌లో నమోదు చేయడం వంటి విషయాలపై చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖ జిల్లా మొత్తం 84,830 కేసుల్లో 83,187 కేసులు గ్రేటర్ విశాఖలో నమోదైనట్లు SGSW శాఖ డైరెక్టర్ పర్యటనలో గమనించారు. ఫీల్డ్ ఫంక్షనరీలు అధిక శాతం కేసులను Deathగా నమోదు చేయడంపై ఆందోళన వ్యక్తం చేసిన డైరెక్టర్, సదరు సిబ్బందిని సస్పెన్షన్‌లో ఉంచవలసిందిగా జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ సూచన మేరకు విశాఖ మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ శ్రీ S.S. వర్మ సిబ్బంది పై సస్పెన్షన్ వేటు విధించారు.



## కార్వాన్ నియోజకవర్గంలో భారీ చేరికలు: బహుజన రాజ్యాధికారాన్ని లక్ష్యంగా టీఆర్పీ దూసుకెళ్తోంది

హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 30: తెలంగాణ రాజకీయాల్లో సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కార్వాన్ నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందిన పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టీఆర్పీలో చేరారు. ఈ చేరికలను టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి మరియు హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ ఆర్. భావన గారి సూచన మేరకు కార్వాన్ నియోజకవర్గ ఇన్చార్జ్ TVR గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు.పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వయంగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదర ఆహ్వానం పలికారు. మల్లన్న గారు మాట్లాడుతూ, "కార్యకర్త అంటే కేవలం జెండా మోసేవాడు మాత్రమే కాదు, రేపటి రాజ్యాధికారంలో సమాన వాటాదారుడు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బహుజనులను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయి. కానీ టీఆర్పీలో ప్రతి కార్యకర్త ఒక నాయకుడు. అంకితభావంతో కదలండి, అసెంబ్లీ గేట్లు తాకుదాం, రాజ్యాధికారాన్ని సాధిద్దాం" అని అన్నారు.

## తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జెండా ఆవిష్కరణ



హైదరాబాద్, సందేశం టైమ్స్, మార్చి 30: పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం కుటుంబసభ్యుల ఆనందోత్సాహాల మధ్య తెలుగుదేశం జెండాను ఆవిష్కరించి, పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో myself పాల్గొన్నాను. నాలుగు దశాబ్దాల క్రితం స్థాపితమైన తెలుగు దేశం పార్టీ తెలుగు జాతి కీర్తిపతాకాన్ని ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడిస్తోంది. తెలుగు ప్రజల జీవితాల్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో చిరస్థాయిగా ముద్ర వేసిన పసుపు జెండా పండుగ వాడవాడలా ఘనంగా నిర్వహించిన కార్యకర్తలు, నేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.